సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


శనివారం । 11 । మే । 2024

VII



ప్రగతిలో పిఠాపురం VIII లో

చీకటిని చీల్చుతూ ప్రగతి పట్టాలెక్కింది.. స్వచ్ఛత పల్లెవించింది.. ప్రతి రోడ్డూ కొత్త రూపును సంతరించుకుంది.. బడి బాగుపడింది. అధునాతన సౌకర్యాలతో ఊరే మారింది..



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0° / 26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	37.0	26.0
కాకినాడ	36.7	27.6
అమలాపురం	41.0	28.0

న్యూస్‌రీల్

ముస్లింలపై కూటమి కుట్ర

- తామంతా వైఎస్సార్ సీపీ వైపే
- జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్



అమలాపురం టౌన్: ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేయాలని కూటమి పార్టీలు కుట్ర పన్నుతున్నాయని, ఈ ఎన్నికల్లో జిల్లా ముస్లింలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అమలాపురంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు అప్పట్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల తర్వాత ఆ రిజర్వేషన్లను ఎత్తివేయాలన్న ఆలోచనతో కూటమి పార్టీలైన బీజేపీ, టీడీపీ, జనసేనలు ఉన్నాయన్నారు. ఈ నాలుగు శాతం రిజర్వేషన్లను అలాగే కొనసాగేలా చూస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభయం ఇవ్వడం అభినందనీయమన్నారు. ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ముస్లింలకు డీబీటీ ద్వారా దాదాపు రూ.26 కోట్ల మేర పలు సంక్షేమ పథకాలు అందించారన్నారు. అలాగే హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.14.50 కోట్ల మేర రాయితీ అందించారని గుర్తు చేశారు. మసీదుల్లో ఇమామ్, మౌజన్‌లకు రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున అందిస్తున్నారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ముస్లింలకు ఐదు అసెంబ్లీ స్థానాలు, ప్రస్తుతం ఏడు అసెంబ్లీ స్థానాల్లో టిక్కెట్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనని స్పష్టం చేశారు. మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఇలా చెప్పుకొంటూ పోతే రాజకీయంగా సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ముస్లింలకు అన్నివిధాలా అండగా నిలిచిన సీఎం జగన్‌ను తిరిగి గెలిపించుకుందామని ఖాదర్ విజ్ఞప్తి చేశారు.

13న వేతనంతో కూడిన సెలవు

అమలాపురం రూరల్: యానాం ప్రాంతంలో పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు ఈ నెల 13న వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తూ యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కోనసీమ జిల్లాలో ఓటు హక్కు కలిగి యానాం ప్రాంతంలోని వివిధ వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు 13న వేతనంతో కూడిన సెలవును ప్రకటించారన్నారు. ఈ ఆదేశాలను తూచా తప్పకుండా ఆయా యాజమాన్యాలు అమలు చేయాలన్నారు. కార్మికులు ఆ రోజు జిల్లాలో జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి

అమలాపురం రూరల్: జిల్లాలోని ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలూ తీసుకున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఫొటో ఓటర్ గుర్తింపు కార్డు (ఎపిక్) కార్డు లేకుంటే, 12 రకాల గుర్తింపు కార్డుల ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఇందులో ఆధార్ కార్డు, నరేగా జాబ్‌కార్డు, బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ పుస్తకాలు (పాస్ బుక్), కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్ పోర్టు, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన దివ్యాంగుల గుర్తింపు కార్డు, ఎపిక్ కార్డులో స్పెల్లింగ్ తప్పులున్నా ఆ ఓటరు నిజమైన ఓటరేనని నిర్ధారించుకున్న తర్వాత ఓటు వేయడానికి అనుమతి ఇస్తారన్నారు. ఒకవేళ ఓటరు గుర్తింపు కార్డులో ఫొటో తప్పుగా ఉంటే మాత్రం ఇతర 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు వేయవచ్చన్నారు.

రత్నగిరి.. భక్తజనఝురి

అన్నవరం: అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శుక్రవారం కిక్కిరిసింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని ఆలయ అధికారులు తెలిపారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు నాలుగు వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

నేడు పిఠాపురానికి సీఎం జగన్

- ఎన్నికల ప్రచారానికి ఇక్కడే ముగింపు
- వెల్లువలా తరలి రానున్న జనం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉమ్మడి తూర్పు గడ్డపై ముగింపు పలకనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో వివిధ రూపాల్లో ఇప్పటి వరకూ సీఎం జగన్ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, మేమంతా సిద్ధం బస్సు యాత్రలు ఒకదానికి మించి మరొకటి జనసంద్రంతో పోటెత్తుతున్నాయి. జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మీదుగా సాగిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర తదనంతరం జరిగిన ఎన్నికల ప్రచార సభలు జన ప్రభంజనాన్ని తలపించాయి. జిల్లాలో జగన్ అడుగు పెట్టిన ప్రతిసారీ మేమంతా మీకు తోడుగా ఉన్నామంటూ వేలాది మంది ఆయన అడుగులో అడుగులు వేసి మద్దతుగా నిలిచారు. తొలుత జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అటు కోనసీమ, ఇటు మెట్ట ప్రాంతాలు కదలివచ్చాయి. కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో మొదలైన ఈ బస్సు యాత్ర రాజమహేంద్రవరం, రాజానగరం, రంగంపేట, సామర్లకోట, కాకినాడ రూరల్, పిఠాపురం, కత్తిపూడి, తుని మీదుగా అనకాపల్లి జిల్లాలోకి సాగిపోయింది. ఈ బస్సు యాత్రకు అశేషంగా జనం తరలి వచ్చారు. మధ్యలో అచ్చంపేట జంక్షన్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ వెల్లువలా తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. తదనంతరం జిల్లాకు ఒకటి చొప్పున జరిగిన ఎన్నికల ప్రచార సభలు కూడా జనజాతరలను తలపించాయి. గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ వేలాదిగా కదలి వచ్చిన జనం.. తమ అభిమాన నాయకుడిని కళ్లారా చూసి, పులకించిపోయారు. బస్సు యాత్ర అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట సెంటర్‌లో నిర్వహించిన సభతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచార సభలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. మూడు రోజుల క్రితం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో నిర్వహించిన రెండో సభలో అశేషంగా తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రం పిఠాపురంలో శనివారం సాయంత్రం నిర్వహించే సభతో ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ ముగింపు పలకనున్నారు. ఆయన సభలన్నీ ఒకదానికి మించి మరొకటి విజయవంతం కావడంతో ఉమ్మడి జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నెలకొంది. జగన్ అడుగు పెట్టిన ప్రతిచోటా జనసునామీ పోటెత్తింది. ఆయన పాల్గొంటున్న పిఠాపురం సభను కూడా అదిరిపోయేలా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంతో కదులుతున్నాయి.

సీఎం పర్యటన జరగనుందిలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా కైకలూరులో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి 2.55 గంటలకు పిఠాపురం హెలిప్యాడ్‌లో దిగనున్నారు. అక్కడి నుంచి పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో జరిగే బహిరంగ సభకు హాజరై 3.20 నుంచి 4.05 గంటల వరకూ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. సభ అనంతరం తాడేపల్లి బయలుదేరి వెళ్తారు.

వెల్లువెత్తిన అభిమానంతో...

సహజంగానే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి పర్యటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడతోనే ప్రారంభమైంది. అప్పటి నుంచీ ఆయన అంటే తూర్పు గడ్డ ఎంతో అభిమానం చూపిస్తోంది. మహానేత హఠాన్మరణం తరువాత అసువులు బాసిన వారి కోసం కాంగ్రెస్‌కు ఎదురొడ్డి పోరాడి, జగన్ నిర్వహించిన ఓదార్పు యాత్ర జిల్లా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఆ తరువాత రైతుల భవిష్యత్తు కోసం రావులపాలెం నుంచి పోలవరం వరకూ హరిత యాత్ర పేరిట పాదయాత్ర నిర్వహించి వారి మనసుల్ని చూరగొన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజల మేలు కోసం ప్రతిపక్ష నేతగా జగన్ నిరంతరం పరితపించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 99 శాతం పైగా అమలు చేసి చూపించారు. ఇచ్చిన ప్రతి మాటా అమలు చేయబట్టే జగన్ సభ అంటేనే పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా జనం వెల్లువలా తరలి వస్తున్నారు.

కూటమిలో కుమ్ములాట

- అయినవిల్లిలో టీడీపీ, జనసేన నేతల తోపులాట
- ఉమ్మడి ఆత్మీయ సమ్మేళనం రసాభాస
- పెత్తనం కోసం ఇరుపార్టీల నేతల యత్నాలు



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో జనసేన నాయకుల వీరంగం (ఫైల్)

సాక్షి, అమలాపురం: ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉంది కూటమి పార్టీల వ్యవహారం.. మూడు పార్టీల్లోనూ సమన్వయం కొరవడడంతో ప్రతి సందర్భంలోనూ రచ్చరచ్చ అవుతోంది.. ఎన్నికల వేళ ఇది మరింత ముదిరింది. ఈ అంశం ఎన్నికల్లో ప్రతికూలంగా మారుతుందని ఆయా పార్టీల నేతలు చర్చించుకోవడం గమనార్హం. ఏదేమైనా పి.గన్నవరం నియోజకవర్గంలోని కూటమి పార్టీల కుమ్ములాట హాట్ టాపిక్ అయ్యింది.

పి.గన్నవరం నియోకజవర్గంలో టీడీపీ, జనసేన మధ్య సమన్వయం కొరవడింది. మరో రెండు రోజుల్లో ఎన్నికల పోలింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీల మధ్య విభేదాలు ముదిరిపాకాన పడ్డాయి. క్షేత్రస్థాయిలో రెండు పార్టీల క్యాడర్ మధ్య సమన్వయం లేక జనసేన విజయావకాశాలపై ప్రభావం చూపనుంది. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని తొలుత టీడీపీ నిర్ణయించుకుంది. ఆ పార్టీ తరఫున సరిపల్లి రాజేష్‌కుమార్ (మహాసేన రాజేష్)ను ఎంపిక చేశారు. అయితే అతని అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గ జనసేన నాయకులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. తమ పార్టీకి చెందిన గిడ్డి సత్యనారాయణరావుకు ఈ సీటు ఇవ్వాలని పట్టుబట్టారు. దీనిపై అప్పట్లో పి.గన్నవరంలో టీడీపీ కార్యాలయాన్ని, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ప్రస్తుత టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను ఘెరావ్ చేశారు. రాజేష్ అభ్యర్థిత్వం పట్ల టీడీపీలో కూడా సానుకూలత లేకపోవడంతో జనసేన నాయకులు చెలరేగిపోయారు. పి.గన్నవరంలోనే కాకుండా అంబాజీపేటలో జరిగిన సమావేశంలోనూ వీరంగం సృష్టించారు. ఇక్కడ కూడా ఎంపీ అభ్యర్థి హరీష్‌పై విరుచుకుపడ్డారు. ఆయన వచ్చిన కారును ధ్వంసం చేశారు. టీడీపీ నేతలను నానా దుర్భాషలాడారు. మొత్తం మీద నానా రభస సృష్టించి గిడ్డి సత్యనారాయణకు టిక్కెట్ తెచ్చుకున్నారు. ఇదే పంథాను ప్రచారంలో కూడా జనసేన నేతలు అమలు చేశారు. టీడీపీ నాయకులను పక్కనబెట్టారు. తమ ఆధిపత్యం ప్రదర్శిస్తూ టీడీపీ



నాయకులను నామమాత్రం చేశారు.

తాజాగా శుక్రవారం అయినవిల్లి మండలంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీల ఆత్మీయ సమ్మేళనం రసాభాసగా మారింది. టీడీపీ అయినవిల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శి కుడుపూడి బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అమలాపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ హాజరయ్యారు. టీడీపీ, బీజేపీ నాయకులను మాత్రమే వేదిక మీదకు పిలిచారు. జనసేన నాయకులను పిలవలేదని ఆ పార్టీకి చెందిన తోలేటి ఉమా, ఇతరులు మండిపడ్డారు. ఏకపక్షంగా సమావేశాలు నిర్వహిస్తున్నారంటూ ఆ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ఇష్టం అన్నట్టుగా టీడీపీ నేతలు చెప్పడంతో వారి మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఒక పార్టీ నేతలపై మరో పార్టీ నేతలు దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. సహచర పార్టీ నాయకులు సకాలంలో వారిని అదుపు చేశారు. లేకుంటే ఒకరి మీద ఒకరు కలబడే పరిస్థితి తలెత్తేది. ఆగ్రహించిన జనసేన నాయకులు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ సమయంలో ఎంపీ అభ్యర్థి హరీష్ ఇరు పార్టీల వారిని సముదాయించారు. జనసేన నాయకులను బుజ్జగించిన హరీష్ వారిని తిరిగి సమావేశానికి తీసుకువచ్చారు. అయితే భోజనాల వద్ద మరోసారి రెండు పార్టీ నేతలు వాదనకు దిగడంతో ఆత్మీయ సమ్మేళనం అభాసుపాలయ్యింది. ఈ పరిస్థితిని గమనించిన టీడీపీ ఎంపీ అభ్యర్థి నియోజకవర్గంలో మూడు పార్టీల మధ్య సమన్వయానికి ఒక కమిటీ వేసి ఇలాంటి సమస్యలకు సర్దుబాటు చేస్తామని చెప్పడం విశేషం. తొలి నుంచీ పి.గన్నవరం నియోజకవర్గంలో ఉమ్మడి పార్టీల మధ్య సమన్వయం కొరవడినా చక్కదిద్దేవారు లేకపోవడంతో పరిస్థితి చేయిదాటిపోయింది.

జనసేన నేతలు తమను అడుగడుగునా అవమానిస్తున్నారంటూ టీడీపీ నేతలు మండి పడుతున్నారు. ముఖ్యంగా ఆ పార్టీలోని ఎస్సీ, బీసీ నేతలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పార్లమెంట్ అభ్యర్థి హరీష్ మాధుర్‌ను టార్గెట్ చేస్తూ జనసేన నేతలు పలు సందర్భాల్లో వివాదాలు సృష్టించడం వారిని ఆగ్రహానికి గురి చేస్తోంది. ఇంత జరుగుతున్నా జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ నోరుమెదపక పోవడాన్ని టీడీపీ వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. తమ పార్టీ పెద్దలకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.


రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచి ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు జారీ చేయరాదని, వార్తా పత్రికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచురించదలచిన ప్రకటనలపై ఎంసీఎంసీ కమిటీ అనుమతి తప్పనిసరని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఎన్నికల చివరి దశలో ప్రింట్ మీడియాలో అభ్యంతరకరమైన తప్పుదోవ పట్టించే ప్రకటనలు ప్రచురించరాదన్నారు. ఈ నెల 11వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. శాటిలైట్ చానళ్లు, కేబుల్ టీవీలు, రేడియో, బల్క్ మెసేజ్‌లు, ఈ- పేపర్లు, సామాజిక మాధ్యమాలు, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఉంచే ఎల్ఈడీ స్క్రీన్‌లు ఎలక్ట్రానిక్ మీడియా కిందకే వస్తాయన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి తరఫు వ్యక్తులు రాజకీయ ప్రయోజనం కోసం వార్తా పత్రికల్లో ఈ నెల 12, 13 తేదీల్లో ప్రచురించుకోవాలనే ప్రకటనలకు మీడియా ధ్రువీకరణ సమన్వయ కమిటీ (ఎంసీఎంసీ) వారికి రెండు రోజుల ముందుగా దరఖాస్తు చేసి అనుమతి పొందాలని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీని సంప్రదించి ముందస్తుగా అనుమతులు పొందాలని తెలియజేశారు. వార్తాపత్రికలు, ప్రింట్ మీడియా యాజమాన్యం కూడా ఈ విషయాన్ని గమనించి అభ్యర్థులు, ఇతరులు 12, 13 తేదీల్లో ఇచ్చే రాజకీయ ప్రచార ప్రకటనలు ప్రచురించే ముందు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి పొందిన అనుమతి ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలన్నారు. జిల్లా పరిధిలోని అభ్యర్థులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించి, ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కోరారు. దేశంలో అన్నిదశల్లో ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఎగ్జిట్ పోల్స్ నిర్వహించి ప్రసారం చేయడం చట్ట రీత్యా విరుద్ధమని ఆయన తెలిపారు.

మరో 4 కంపెనీల కేంద్ర బలగాలు



ఎస్పీ సునరావు శ్రీధర్

అమలాపురం టౌన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చిన బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు రెండు దఫాలుగా 9 కంపెనీల కేంద్ర బలగాలు వస్తే, తాజాగా మరో 4 కంపెనీల కేంద్ర బలగాలు గురు, శుక్రవారాల్లో చేరుకున్నాయని ఎస్పీ సునరావు శ్రీధర్ వెల్లడించారు. రాజస్థాన్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి ఈ బలగాలు వచ్చాయన్నారు. ఒక్కో కంపెనీకి దాదాపు 100 మంది సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధులు ఉంటారన్నారు. ఈ లెక్కన జిల్లాకు కేంద్ర బలగాల ద్వారా 1,300 మంది వచ్చారు. గత నెల రోజులుగా వీరు జిల్లాలో ఎన్నికలపరంగా సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కవాతులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా జిల్లా పోలీసులతో పాటు కేంద్ర బలగాలు భరోసాగా నిలుస్తున్నాయని ఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేశామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడ ఏం జరిగినా పోలీసు శాఖకు క్షణాల్లో తెలిసేలా నెట్‌వర్క్ పనిచేస్తుందని వివరించారు. జిల్లా పోలీసు శాఖ, కేంద్ర బలగాలకు తోడు జిల్లాకు పోలీస్ అబ్జర్వర్‌గా నియమితులైన ఎంవీ చంద్రకాంత్ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల వద్ద వివాదాలు, తగాదాలు, ఘర్షణలు, తప్పిదాలు జరిగితే పోలీసులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

జగన్ ప్రభుత్వంలోనే బ్రాహ్మణులకు గుర్తింపు

- రాష్ట్ర దేవదాయ శాఖ ముఖ్య సలహాదారు శ్రీకాంత్
- అమలాపురంలో బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు

అమలాపురం టౌన్: సీఎం జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలోని బ్రాహ్మణులకు రాజకీయ, సామాజిక గుర్తింపు లభించిందని రాష్ట్ర దేవదాయ శాఖ ముఖ్య సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ అన్నారు. అమలాపురం భూపయ్య అగ్రహారంలోని మంథా రాంబాబు ప్రాంగణంలో శుక్రవారం రాత్రి జరిగిన నియోజకవర్గ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళన సభకు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ బ్రాహ్మణ నాయకుడు మాచిరాజు రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, రాష్ట్ర డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణులపై ఉక్కుపాదం మోపుతూ ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని గుర్తు చేశారు. అదే ముఖ్యమంత్రి జగన్ బ్రాహ్మణుల పక్షపాతిగా 2019 ఎన్నికల్లో నలుగురు బ్రాహ్మణులకు పార్టీ టిక్కెట్లు ఇచ్చారని అన్నారు. అర్చకులకు భరోసాగా నిలిచారని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలోని వివిధ నగరాల్లో కార్పొరేటర్లుగా, పట్టణాల్లో కౌన్సిలర్లుగా, పలు నామినేటెడ్ పదవులతో ఉన్నారని గుర్తు చేశారు. జగన్ ఆశయంతో ముందుకు సాగుతుంటే.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఆశతో వస్తున్నారన్నారు. ఈ తేడాను బ్రాహ్మణులు గమనించి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, కార్పొరేషన్ డైరెక్టర్ అంజిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణులకు ముఖ్యంగా అర్చకులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. విశ్వరూప్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రూ.కోటితో అమలాపురంలో బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే అమలాపురం మున్సిపాలిటీలో బ్రాహ్మణుల వాణి వినిపించేలా ఆ సామాజిక వర్గానికి కౌన్సిలర్, నామినేటెడ్, కోఆప్షన్ పదవులు ఇస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ సమాజం తరఫున మంత్రి విశ్వరూప్, శ్రీకాంత్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ బ్రాహ్మణ నాయకులు మంథా శివ, పుత్రేవు చందు, పాలగుమ్మి వాసు, దిట్టకవి అమ్మాజీ, సంఘ ప్రతినిధులు మంథా రాంజీ, పేరి శర్మ పాల్గొన్నారు.

ఆ ఇంటికి నవరత్నాలే జీవనాధారం

మామిడికుదురు: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు ఎంతో మంది అభాగ్యులకు జీవనాధారంగా మారాయి. ప్రభుత్వం ద్వారా నెల నెలా అందుతున్న సహాయంతోనే కుటుంబాన్ని నెట్టుకువస్తున్న వారెందరో ఉన్నారు. మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు చెందిన కంచి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులది అలాంటి ఉదాహరణే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్న పథకాలే లేకుంటే తమ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవడానికే భయంగా ఉందంటూ వారు చెబుతున్న మాటలు మనసులను కదిలిస్తున్నాయి.

అన్నీ కష్టాలే..

రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి కంచి నాగేశ్వరరావుది. అతని వయసు 75 ఏళ్లు. నాగేశ్వరరావుకు భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు దుర్గా నరేష్, బాలాజీ ఉన్నారు. ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు దివ్యాంగుడు. రెండో కుమారుడు కిడ్నీ పేషెంట్. అయినా టీడీపీ హయాంలో పెన్షన్ సైతం రాలేదు. దీంతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాగేశ్వరరావుకు వృద్ధాప్య పింఛను మంజూరు చేశారు. పెద్ద కొడుకు దుర్గా నరేష్‌కు వికలాంగ పింఛన్‌గా రూ.3 వేలు వస్తోంది. చిన్న కొడుకు బాలాజీకి నెల నెలా రూ.10 వేలు డయాలసిస్ పెన్షన్ అందించేవారు. అయితే గత నెలలో బాలాజీ మృతి చెందారు. నాగేశ్వరరావుకు యాక్సిడెంట్‌లో కాలు విరిగిపోతే ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేశారు. దానికి గాను రూ.70 వేలు ప్రభుత్వం విడుదల చేసింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో రూ.5 వేలు ఇచ్చారు. నాలుగేళ్ల నుంచి ఏటా రైతు భరోసాగా రూ.13,500 ఇస్తున్నారు. నవరత్నాల్లో ఐదు సంక్షేమ పథకాలు తమ కుటుంబానికి వస్తున్నాయని నాగేశ్వరరావు తెలిపారు.



కంచి నాగేశ్వరరావు కుటుంబం

ప్రతి నెలా ఇంటి వద్దనే రేషన్ సరకులు ఇస్తున్నారని, ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ ఇంటికే పెన్షన్ కానుక అందజేస్తున్నారని నాగేశ్వరరావు చెబుతున్నారు.

మా కుటుంబానికి జగన్ ఆపద్బాంధవుడు



అనారోగ్యం, కుటుంబ పరిస్థితులు మా జీవితాలను కకావికలం చేశాయి. అలాంటి సమయంలో మా కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆపద్బాంధవుడిగా నిలిచారు. నాతో పాటు నా పెద్ద కొడుక్కి, చిన్న కొడుక్కి కూడా పెన్షన్ ఇచ్చారు. రైతు భరోసా, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు మా ఇంట్లో వెలుగులు నింపాయి. నా జీవితంలో ఎన్నో ప్రభుత్వాలను చూశాను కాని ఏ ప్రభుత్వం ఇలా పేదలను ఆదుకోలేదు.

– కంచి నాగేశ్వరరావు, పెదపట్నంలంక

పెన్షన్ సహాయమే ఆధారమైంది



మా కుటుంబ పరిస్థితి చాలా దయనీయం. నాన్న ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి. ఇంటి వద్దే ఉంటారు. తమ్ముడికి వారానికి రెండు రోజులు డయాలసిస్ చేయించేవాళ్లం. మా తమ్ముడు గత నెలలో చనిపోయాడు. నాన్నకు, నాకు, తమ్ముడికి పింఛన్ రూపేణా నెలకు రూ.16 వేలు ఇచ్చేవారు. అవే మా కుటుంబానికి ఆధారమయ్యాయి. లేకుంటే మా కుటుంబ పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. జగన్ సార్ చేసిన మేలు జీవితంలో మర్చిపోలేం.

– కంచి దుర్గా నరేష్, పెదపట్నంలంక

క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు



అడ్వాన్స్‌డ్ క్రియేటివిటీ సర్టిఫికెట్ కోర్సుపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 15 నుంచి అడ్వాన్స్‌డ్ క్రియేటివిటీ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే శుక్రవారం తెలిపారు. కళాశాల జేకేసీ, ఐఏసీటీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పది, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులకు తమ కళాశాలలో అడ్వాన్స్‌డ్ క్రియేటివిటీపై సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ఇస్తున్నామన్నారు. షార్ట్ టర్మ్ కోర్సులైన సర్టిఫికెట్ కోర్సు ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, సర్టిఫికెట్ కోర్సు ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ అప్లికేషన్, డీటీపీ, వీడియో ఎడిటింగ్‌లతో పాటు లాంగ్ టర్మ్ కోర్సులైన వీఎఫ్ఎక్స్, కంపోస్టింగ్ ప్లస్, త్రీడీ యానిమేషన్‌లకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 14న కళాశాలలో జరిగే అవగాహన సదస్సుకు హాజరై, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు 90301 10847, 85199 66620, 79818 62200 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రగతిలో పిఠాపురం

- అన్నింటా అభివృద్ధి పథాన పట్టణం
- ఐదేళ్లలో అదరగొట్టిన సంక్షేమం
- మున్సిపాలిటీలో ప్రధాన సమస్యలకు మోక్షం

పిఠాపురం: చీకటిని చీల్చుతూ ప్రగతి పట్టాలెక్కింది.. స్వచ్ఛత పల్లెవించింది.. ప్రతి రోడ్డూ కొత్త రూపును సంతరించుకుంది.. బడి బాగుపడింది.. అధునాతన సౌకర్యాలతో ఊరే మారింది.. ఈ ఐదేళ్లలో పిఠాపురం పట్టణం ఎనలేని అభివృద్ధిని సొంతం చేసుకుంది.. ఆ విశేషాలు తెలుసుకుందాం రండి. పీఠికాపురం రావు వెంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పరిపాలించిన ఈ ప్రాంతం 1957లో పిఠాపురం మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎనిమిది మంది చైర్మన్లు బాధ్యతలు నిర్వర్తించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆధ్యాత్మిక కేంద్రం పిఠాపురం అభివృద్ధిలో దూసుకుపోతోంది. 2019 నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.150 కోట్లతో వివిధ పనులు చేయడం విశేషం.

ఏళ్ల నాటి సమస్యల పరిష్కారం

పిఠాపురంలో ముఖ్యంగా పారిశుధ్య సమస్య వెంటాడేది. రోడ్లు, డ్రెయిన్లు మురికి కూపాలుగా మారేవి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.6 కోట్లతో అన్ని వార్డుల్లోనూ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ఇక్కడి ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారికి పెద్దాసుపత్రిగా ఉన్న సీహెచ్‌సీని ఆధునీకరించారు. ఎక్కడా లేని విధంగా స్త్రీల వార్డును అభివృద్ధి చేశారు. వైద్య సదుపాయాలు మెరుగుపర్చారు. పట్టణంలో మంగయ్యమ్మరావుపేటలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. పట్టణంలోకి వచ్చే వారికి ఇప్పటి వరకూ నరకం చూపించిన రైల్వే గేట్ల సమస్యకు పరిష్కారం చూపించి.. మాధవపురం, గోర్స రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీలు నిర్మించారు. ప్రధాన రహదారిలో ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం స్థానిక రైల్వే స్టేషన్‌ను రూ.కోట్లతో ఆధునీకరించారు. పట్టణంలో ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధితో పాటు రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ సెంటర్లు నిర్మించారు. మంచినీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడానికి సుమారు రూ.32 కోట్లు వెచ్చిస్తున్నారు.



పిఠాపురంలో కొత్తగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్



పిఠాపురంలో మాధవపురం వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి



నాడు-నేడు పనుల్లో సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల

నాడు- నేడుతో బాగుబడింది

పిఠాపురం మున్సిపల్ పరిధిలోని 79 పాఠశాలల్లో మొదటి విడత ‘నాడు- నేడు’ నిధులు రూ.11.07 కోట్లతో 40 ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడత నాడు- నేడు నిధులు రూ.20.12 కోట్లతో 56 పాఠశాలలను అభివృద్ధి చేసే పనులు పూర్తి కావొచ్చాయి. తొలి విడత అభివృద్ధి చేసిన కొన్ని పాఠశాలల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు ప్రైవేట్‌కు ధీటుగా మారాయి.

గత ఐదేళ్లలో వెచ్చించిన నిధులు ఇలా..

- రూ.85 లక్షలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం
- రూ.8.84 కోట్ల 14వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ అభివృద్ధి పనులు
- రూ.5.50 లక్షలతో జగనన్న నగర బాటల అభివృద్ధి
- రూ.98.50 లక్షల ఎంపీ నిధులతో పనులు
- రూ.6 కోట్ల గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో పనులు
- రూ.5.21 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో పలుచోట్ల అభివృద్ధి
- రూ.9.93 కోట్ల జనరల్ ఫండ్స్‌తో పనులు
- రూ.30.10 కోట్ల అమృత్ పథకం నిధులతో తాగునీటి సరఫరా అభివృద్ధి పనులు (త్వరలో ప్రారంభం కానున్నాయి)
- రూ.5.50 కోట్లతో మాధవపురం రైల్వే అండర్ బ్రిడ్జి
- రూ.4.50 కోట్లతో రైల్వే గోర్స అండర్ బ్రిడ్జి
- రూ.150 కోట్లతో ఉప్పాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం (త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.)
- రూ.5 కోట్లతో పట్టణంలో రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- రూ.4.7 కోట్లతో డిగ్రీ కాలేజీ నిర్మాణం

ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి

ప్రభుత్వ ప్రోత్సాహంతో పిఠాపురం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశాం. ప్రధాన సమస్యలైన రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాం. ఒక్క మున్సిపాలిటీ ద్వారానే ఇప్పటి వరకూ రూ.63 కోట్లకు పైగా నిధులు వెచ్చించి పనులు చేశాం. మరిన్ని నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో వార్డు సచివాలయానికి రూ.20 లక్షలు ఇవ్వగా, మా విజ్ఞప్తి మేరకు మరో రూ.20 లక్షల చొప్పున అదనపు నిధులు అందించారు. పట్టణంలో ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపించాం.

–గండేపల్లి సూర్యావతి, చైర్‌పర్సన్, పిఠాపురం మున్సిపాలిటీ

గాండ్ల, తెలుకుల, దేవతెలుకులకు సముచిత స్థానం



సంకిస భవానీప్రియ

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాండ్ల తెలుకుల దేవతెలుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి సామాజికవర్గ అభివృద్ధికి బాటలు వేశారని రాష్ట్ర గాండ్ల తెలుకుల దేవతెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీప్రియ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఆమె ‘సాక్షి’తో మాట్లాడుతూ ఈ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది డైరెక్టర్లను నియమించారన్నారు. అదేవిధంగా సామాజిక వర్గీయులకు మున్సిపాలిటీలు, పంచాయతీల్లో వివిధ పదవులు, నామినేట్ పోస్టులు అందించి సముచిత స్థానం కల్పించారని ఆమె అన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గాండ్ల కులస్తులు సంక్షేమ పథకాలను పొందారని, ఈ ఐదేళ్లలో అనేక రూ.కోట్ల లబ్ధి జరిగిందన్నారు. శ్రీకాకుళంలో ప్రభుత్వ స్థలం కేటాయించి గాండ్ల కమ్యూనిటీ భవనం నిర్మించారన్నారు. కుప్పంలో రెండెకరాల స్థలం కేటాయించి కల్యాణ మండపం, కమ్యూనిటీ హాల్ నిమిత్తం ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ.50 లక్షలు, ప్రభుత్వం ద్వారా మరో రూ.50 లక్షలు ఇస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారని ఆమె వివరించారు. మన్యం జిల్లాలోని పార్వతీపురంలో గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో అనేక మంది గాండ్ల కులస్తులు ఇళ్ల పట్టాలు పొందారన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

అయినవిల్లి: ఓ వ్యక్తి శుక్రవారం విద్యుదాఘాతానికి మృతి చెందాడు. దీనికి సంబంధించి మృతుడి బంధువులు, ఎస్సై వి.రాజేష్‌కుమార్ కథనం ప్రకారం.. అయినవిల్లి మండలం నేదునూరు బొక్కావారిపాలేనికి చెందిన బొక్కా మధుసుదనరావు (38) తన ఇంట్లో వైరింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయవాడలో బ్రిక్స్ కంపెనీలో ఆపరేటర్‌గా ఆయన పనిచేస్తున్నాడు. దీనిపై మృతుడి తండ్రి గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అన్నదేవరపేటలో మరొకరు..



మృతి చెందిన వసంతవాడ రాంబాబు

తాళ్లపూడి: అన్నదేవరపేటలోని పామాయిల్ తోటలో విద్యుత్ షాక్‌కు ఓ వ్యక్తి మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్‌సుందర్ కథనం ప్రకారం.. బీమోలు రైతు ముళ్లపూడి రత్నాజీకి చెందిన పామాయిల్ తోటలో వసంతవాడ రాంబాబు (32) పని చేయడానికి వెళ్లాడు. పామాయిల్ చెట్టు గెలలు, ఆకులను ఐరన్ పైప్‌తో నరుకుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో రాంబాబు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో రైతు రత్నాజీ మరొకరి సాయంతో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి అతన్ని తరలించారు. అయితే రాంబాబు అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య వసంతవాడ నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

మలికిపురం: విశ్వేశ్వరాయపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త జిల్లెళ్ల గౌతమ్‌పై టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడి చేశారు. శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి కార్యకర్తలు విశ్వేశ్వరాయపురంలో వైఎస్సార్ సీపీ జెండాతో ఉన్న కార్యకర్త గౌతమ్‌పై దాడి చేశారు. స్పృహ తప్పిన అతన్ని స్థానికులు రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న గౌతమ్‌ను రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు పరామర్శించారు. కూటమి దాడిని తీవ్రంగా ఖండించారు.

సఖినేటిపల్లిలోనూ దురుసు ప్రవర్తన

కూటమి ర్యాలీ సందర్భంగా సఖినేటిపల్లి మండలంలో కూడా టీడీపీ, జనసేన నాయకులు దురుసుగా ప్రవర్తించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ సామరస్యంగా ప్రచారం చేస్తుండగా టీడీపీ నాయకులు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సఖినేటిపల్లి లాకుపేట, మెయిన్ రోడ్లలో ఈ సంఘటనలు చోటు చేసుకున్నాయి.



వైఎస్సార్ సీపీ కార్యకర్త గౌతమ్‌ను పరామర్శిస్తున్న అభ్యర్థులు గొల్లపల్లి సూర్యారావు, రాపాక వరప్రసాదరావు

ఓటమి భయంతో దాడులకు తెగబడుతున్న టీడీపీ

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కల్యాణి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

కాకినాడ రూరల్: టీడీపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులకు తెగబడుతోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా ప్రచారం చేసేందుకు వచ్చిన ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బీసీ సంఘాల నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. టీడీపీ కూటమిని ఓడించేందుకు ప్రజలు డిసైడ్ అవ్వడంతో బాబుకు నిద్ర పట్టడం లేదన్నారు. ఇటీవలే హోం మంత్రి తానేటి వనితపై దాడి చేశారని, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణిపై దాడికి పాల్పడ్డారని చెప్పారు. విజయవాడలో బొండా ఉమా కుమారుడు దళితులపై దాడికి పాల్పడ్డారని, బనగానపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలు, మహిళలపై టీడీపీ నాయకులు దాడికి తెగబడ్డారని గుర్తు చేశారు. టీడీపీ కూటమి ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధిస్తుందని కల్యాణి అన్నారు. సీఎం జగన్ నలుగురు బీసీలకు రాజ్యసభ సీట్లు ఇస్తే.. బాబు ఒక్క బీసీకి కూడా సీటు ఇవ్వకుండా బీసీ ద్రోహిగా నిలిచారన్నారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకు ఇవ్వాలని సీఎం జగన్ చట్టం తీసుకువచ్చారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు జమ్మలమడక నాగమణి, వర్ధినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యపై దాడి సరికాదు

రాజమహేంద్రవరం సిటీ: శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఆర్.కృష్ణయ్యపై టీడీపీ రాళ్ల దాడి చేయడం దారుణమని బీసీ సంక్షేమ సంఘ జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో గెలవాల్సిన టీడీపీ నాయకులు ప్రత్యర్థులపై భౌతిక దాడులకు దిగడం పిరికిపంద చర్య అని ఆమె మండిపడ్డారు.

మద్యం అక్రమ రవాణాపై కేసులు

- తొమ్మిది మంది అరెస్ట్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిఘా బృందాలు మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాయి. కోనసీమ జిల్లాలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో మొత్తం 934 మద్యం సీసాలు, 202 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్)ను స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడులు, తనిఖీల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం శుక్రవారం రాత్రి తెలిపింది. జిల్లాలో ఎస్ఈబీ నిఘా బృందాలు దాడులు, తనిఖీలు చేసి మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న 9 మందిని అరెస్ట్ చేసి 10 కేసులు నమోదు చేశారు. వారి నుంచి 771 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 163 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 202 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.18 వేల విలువైన తొమ్మిది జతల ఫ్యాంటులు, షర్ట్ బిట్లు, తొమ్మిది చీరలు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం, జొన్నాడ, బొబ్బర్లంక, ఎదుర్లంక, దిండి, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా బృందాలు వాహనాలను ఆపి శుక్రవారం విస్తృత తనిఖీలు చేశాయి. తాళ్లరేవు మండలం కోరింగి గ్రామంలోని షాడో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎంవీ చంద్రకాంత్ తనిఖీ చేశారు. అలాగే మండలంలోని సముద్ర తీరం హోప్ ఐలెండ్‌లో నివాసం ఉంటున్న ప్రజలతో ఆయన మమేకమై పోలింగ్ రోజున అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించారు.



తాళ్లరేవు మండలం హోప్ ఐలెండ్ నివాసితులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్

బ్రాహ్మణులకు అండగా ఉంటాం..

- దాడుల నిరోధానికి ప్రత్యేక చర్యలు
- విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

కాకినాడ: బ్రాహ్మణ సామాజికవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడచిన ఐదేళ్లలో ఎన్నో చర్యలు తీసుకున్నారని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక డీ కన్వెన్షన్‌లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కందాళ దుర్గ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సదస్సుకు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మరో ఎమ్మెల్యే మల్లాది విష్ణు హాజరయ్యారు. రాయవరపు ప్రభాకర్, భమిడిపల్లి మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సభలో మల్లాది విష్ణు మాట్లాడుతూ దేవాలయాలు, పురోహితులు, అర్చకులపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూజారుల జీతభత్యాలను రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచారని చెప్పారు. బ్రాహ్మణ వర్గీయులంతా వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ విజ్ఞాన వంతులైన బ్రాహ్మణులు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. ద్వారంపూడి మాట్లాడుతూ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ బ్రాహ్మణ వర్గాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారన్నారు. రాజకీయంగా సముచిత స్థానం కల్పించారన్నారు. బ్రాహ్మణ కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కామేశ్వరరావు, సంఘ ప్రతినిధులు రాయప్రోలు కృష్ణమూర్తి, పోతాప్రగడ రవికుమార్, అజ్జరపు సత్యనారాయణ, శర్మ, పిండిప్రోలు రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, చిత్రంలో కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, చంద్రశేఖరరెడ్డి

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట

కాకినాడ రూరల్: బ్రాహ్మణ సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా ఆయన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ బ్రాహ్మణ సొసైటీ ద్వారా పెద్ద ఎత్తున వ్యక్తిగత, గ్రూపు రుణాలు మంజూరయ్యాయన్నారు. అర్చకులకు వంశపారంపర్య హక్కులు కల్పించి, పదవీ విరమణ తొలగించారని, తద్వారా ఓపిక ఉన్నంత వరకూ అర్చకత్వం చేసుకునే వెసులుబాటు లభించిందన్నారు. బ్రాహ్మణులకు సొసైటీ పేరిట బ్రాహ్మణ బ్యాంకు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఐదేళ్లలో రూ.784 కోట్లు బ్రాహ్మణ సంక్షేమానికి ఖర్చు చేశారని, టీడీపీ హయాంలో కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. మృతి చెందిన కుటుంబాలకు గరుడ పథకంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం పెండింగ్ లేకుండా అందజేశారన్నారు. వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించేందుకు బ్రాహ్మణులు ఏకతాటిపైకి రావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, బ్రాహ్మణ సంఘాల నాయకులు కందాల కనకదుర్గ, రవికుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.